పడిపూజకు రావాలని ఆహ్వానం

ఈ నెల 18వ తేదీ బుధవారం సాయంత్రం తన స్వగృహం వద్ద నిర్వహిస్తున్న శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమానికి రావాలని కోరుతూ బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావును కలిసి ఆహ్వానించారు. పడిపూజకు సంబంధించిన ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

– అంబర్‌పేట, డిసెంబర్ 15

కుస్తీలో మల్లేపల్లి వ్యక్తికి బంగారు పతకం

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి బజార్‌ఘాట్‌కు చెందిన అబ్దుర్ రహ్మాన్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ స్థాయి కుస్తీ పోటీలలో 92 కేజీల విభాగం ఫ్రీస్టైల్‌లో బంగారు పతకాన్ని సాధించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 15

ఆర్థిక సాయం

అంబర్‌పేట డివిజన్ ప్రేంనగర్‌కు చెందిన రాఘవ అనే దివ్యాంగుడు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. అతని సతీమణి రాధికకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి ఆదివారం రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి, బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, డిసెంబర్ 15

బీఆర్ఎస్ హయాంలోనే గుడిమల్కాపూర్ అభివృద్ధి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రిటైల్ మార్కెట్‌లో నిర్మించిన షెడ్లు

- కోట్లాది రూపాయలు వెచ్చించి కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌ల ఏర్పాటు
- వందలాది మందికి పెరిగిన ఉపాధి
- నూతన పాలకవర్గం ఏర్పాటు చేయాలని వేడుకోలు

అబిడ్స్, డిసెంబర్ 15: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం మార్కెట్‌ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాలతో నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల మార్కెట్లను అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా మార్కెటింగ్ శాఖ అధికారులు గుడిమల్కాపూర్ మార్కెట్‌ను అభివృద్ధి చేశారు.

సబ్జిమండిలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను..

గతంలో సబ్జిమండిలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను ఇక్కడికి తరలించారు. అదే విధంగా జాంబాగ్‌లో ఉన్న పూల మార్కెట్‌ను కూడా ఇక్కడికి తరలించారు. ఇదిలా ఉండగా రిటైల్ వ్యాపారులు కూరగాయలను హోల్‌సేల్ మార్కెట్‌లోనే విక్రయాలు చేపట్టేవారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్నో సంవత్సరాలుగా వ్యాపారాలు నిర్వహిస్తున్న రిటైల్ వ్యాపారులను గుర్తించి వారికి లైసెన్స్‌లను జారీ చేయడంతో పాటు ప్రత్యేకంగా పూలమార్కెట్ ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రిటైల్ మార్కెట్‌ను ఏర్పాటు చేసి వందలాది మంది రిటైల్ వ్యాపారులకు అండగా నిలిచారు. అదే విధంగా కూరగాయలను కొనుగోలు చేసేందుకు వచ్చేవారికి కూడా ఎలాంటి ఇబ్బంది పడకుండా వసతులను కల్పించారు. అంతే కాకుండా పూలదండలు తయారు చేసి విక్రయాలు చేపట్టే వారు కూడా వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

వందలాది మందికి ఉపాధి..

మార్కెట్‌ల విస్తరణతో వందలాది మందికి ఉపాధి లభించడంతో పాటు మార్కెట్‌కు కూడా ఆదాయం పెరిగింది. గతంలో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌లు మాత్రమే ఉండేవి. రాష్ట్రం ఏర్పడిన తరువాత నూతన పాలకవర్గం రిటైల్ కూరగాయల మార్కెట్, పూలదండలు తయారు చేసి విక్రయించుకునే వారి కోసం దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెకు ఇవ్వడంతో మార్కెట్‌కు ఆదాయం పెరిగింది.

నూతన పాలకవర్గాన్ని నియమించాలి..

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీకి నూతన పాలకమండలిని ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మార్కెట్‌లకు పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుండగా గుడిమల్కాపూర్ మార్కెట్‌కు పాలకమండలిని ఏర్పాటు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నదని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. పాలక మండలిని నియమిస్తే మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

లైసెన్స్‌దారులకు దుకాణాలను కేటాయించాలి...

గుడిమల్కాపూర్ కూరగాయల, పూల మార్కెట్‌లలో పలువురు అర్హులైన వారిని హోల్‌సేల్ కమిషన్ ఏజెంట్లుగా నియమించారు. వారందరికీ దుకాణాలను కేటాయించాల్సి ఉండగా అలా జరగక పోవడంతో వారు మార్కెట్ యార్డ్‌లోని ఖాళీ స్థలంలో వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని లైసెన్స్‌దారులకు సరిపడా దుకాణాలను నిర్మించి కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గుడిమల్కాపూర్‌లో ఏర్పాటు చేసిన పూల మార్కెట్

కట్టమైసమ్మ ఆలయ పునర్నిర్మాణ పూజ

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ కట్టమైసమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం సాయంత్రం పూజలు నిర్వహించారు. లంగర్‌హౌస్‌లో ఉన్న స్తంభాల మైసమ్మ, ఊర పోచమ్మ, గుండు పోచమ్మ, నల్లపోచమ్మ, బుజిలి మహంకాళి ఆలయాలలో బస్తీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి బుజిలి మహంకాళి ఆలయకమిటీ ఛైర్మన్ బోగి పరమేశ్‌కుమార్, దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు బోగి బాల్‌రాజ్ తదితరులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అరవింద్, మధుసూదన్, శివశంకర్, పూర్ణ చందర్, దేవ్‌రాజ్, ఆమంచి శ్రీకాంత్, పాండు తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 15

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఔత్సాహిక కళాకారులు రుక్మిణి కల్యాణం నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో బీసీ కమిషన్ పూర్వ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, విద్యావేత్త డాక్టర్ జె.గంగాధర్, దీపక్‌కుమార్ లడ్డా, నృత్యగురువు లలితా ధనలక్ష్మి, శ్రీకర ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకురాలు, నృత్యగురువు సుమేధా జోషి పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి కళాకారులను సత్కరించారు.

– (తెలుగు యూనివర్సిటీ)

తిరుగీతికలు ఆడియో, వీడియో ..

తిరుగీతికలు ఆడియో, వీడియోను ఆవిష్కరిస్తున్న రమణాచారి, అనంతలక్ష్మి తదితరులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 15 : సరస్వతీ పుత్ర కళాపీఠం, శ్రీరాగా క్రియేషన్స్ సంయుక్తాధ్వర్యంలో రచయిత్రి డాక్టర్ పుట్టపర్తి నాగపద్మిని రచించిన తిరుగీతికలు ఆడియో, వీడియో ఆవిష్కరణ కార్యక్రమం నఫీజ్‌రెసిడెన్సీలోని రమణాచారి కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. విఖ్యాత వాగ్గేయకారుడు పుట్టపర్తి నారాయణాచార్యుల కూతురు నాగపద్మిని గోదాదేవి తమిళంలో రచించిన 30పాటలను తెలుగులోకి అనువదించారని ప్రశంసించారు. సంగీతదర్శకురాలు వంశీప్రియాధర్మరాజ్ ఎంతో శ్రమపడి రాగాలను సమకూర్చి గాయనీగాయకులతో కలిసి శ్రావ్యంగా గానం చేశారని అభినందించారు. ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి, లేళ్లపల్లి రమేశ్, శ్రీదేవి, చంద్రశేఖర్ భరద్వాజ్ పాల్గొన్నారు.

అభినందన

నాంపల్లిలోని ఓ పెట్రోల్ పంపులో నాలుగు రోజుల క్రితం ఓ ట్యాంకర్‌కు మంటలు అంటుకుని ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో పెట్రోల్ ట్యాంకర్‌ను బంక్‌లో నుంచి ధైర్యంగా బయటకు తీసిన మల్లేపల్లికి చెందిన గౌస్ అనే వ్యక్తిని ఆదివారం నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అభినందించారు.

– మెహిదీపట్నం, డిసెంబర్ 15

కళాకారులను విస్మరించిన సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య

- సీఎం రేవంత్ రెడ్డి స్పందించి కళాకారులకు న్యాయం చేయాలి

రవీంద్రభారతి, డిసెంబర్ 15: తెలంగాణ ప్రభుత్వం ఏడాది ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను ప్రదర్శించడానికి కళాకారులకు కోట్లాది రూపాయల నిధులు విడుదల చేశారని డెక్కన్ థియేటర్స్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఖాజా మన్సూర్, ప్రధాన కార్యదర్శి ప్రణయ్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సంవత్సరం పాలన ముగింపు సందర్భంగా సీఎం ప్రవేశపెట్టిన పథకాలు వాటి ద్వారా ప్రజలకు లబ్ధి పొందిన విధానం గురించి కళారూపంగా సంగీత నాటక కళాకారుల చేత ప్రజల ముందు ప్రదర్శించమని బాధ్యతలను సంగీత నాటక అకాడమీకి అప్పగించారని తెలిపారు. 21 రోజుల కార్యక్రమానికి గాను కోటి రూపాయలు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా రంగస్థలం, నాట్యం, సంగీత, సురభి విద్యను అభ్యసించే నిరుద్యోగ యువత దాదాపు 3వేల మంది ఉన్నారు. వీళ్లు కాక వివిధ కళాజాతాల్లో 2 వేల మంది ఉన్నారని తెలిపారు. కాని సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల నిజమైన కళాకారులకు అవకాశం ఇవ్వకుండా 40 మంది నకిలీ కళాకారులను తీసుకువచ్చి కోటి రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంగీత నాటక అకాడమీలో దుర్వినియోగమైన నిధులపై చర్యలు తీసుకొని, అసలైన కళాకారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి

రవీంద్రభారతి, డిసెంబర్ 15: ఇరవై ఏండ్లుగా పాఠశాల విద్యాభివృద్ధి కోసం పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలలో దాదాపు 19,600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఏండ్లు తరబడిగా వారు చాలీ చాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులను ఉండనివ్వమని, అందరినీ రెగ్యూలరైజ్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ సమగ్ర శిక్ష కార్యక్రమం ప్రారంభమైందని, ఇప్పుడు ఏపీలో పేస్కేల్ ఇస్తున్నారని, తెలంగాణలో కూడా అమలు చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వీరికి వెయిటేజీ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జేఏసీ సలహాదారుడు పి.బడేసాబ్, సాయిబాబా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, సరితగౌడ్, నవనీతగౌడ్, శ్రీవాణి, రమ్య, ఫర్వీన్, గిరిజా భవాన్ని తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం అలరించిన పద్య నాటకం

వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళా పరిషత్ నిర్వహణలో తెలుగువర్సిటీ ఆడిటోరియంలో నాటకదర్శకులు దేవరాజు రవీందర్‌రావు, మాడిశెట్టి రమేశ్ నిర్వహణలో విజయానిరుద్దం పద్యనాటకం ఆద్యంతం నూతన ఒరవడితో సాగగా తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సుధాకర్, ఆహూతుల ప్రశంసలను కళాకారులు అందుకున్నారు.

– (తెలుగు యూనివర్సిటీ)

పుట్‌పాత్‌ల సుందరీకరణ పనుల పరిశీలన

హకీంపేట్ చౌరస్తాలో ఆదివారం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ ఫుట్‌పాత్‌ల సుందరీకరణ, ల్యాండ్ స్కేపింగ్ పనులను పరిశీలించారు. అదే విధంగా చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కార్పొరేటర్ నసీరుద్దీన్ తదితరులతో కలిసి ప్రారంభించారు.

– మెహిదీపట్నం

విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా ?

గుజ్జ సత్యం

కాచిగూడ, డిసెంబర్ 15: తెలంగాణలోని గురుకులాల్లో చదువుతున్న 44 మంది విద్యార్థులు చనిపోయి, 12 వందల మంది అస్వస్థతకు గురైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. ఆదివారం కాచిగూడ లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేయడంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని మండిపడ్డాడు. సీఎం ఢిల్లీకి అనేక మార్లు వెళ్లి.. రావచ్చుకాని, అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించడానికి టైం దొరకడం లేదని అన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి గురుకులాల పనితీరుపై వెంటనే సమీక్షా సమావేశాన్ని నిర్వహించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వీరభద్రస్వామి ఆలయ ధర్మకర్తగా మల్లికార్జున్

కాచిగూడ, డిసెంబర్ 15: కురవి వీరభద్రస్వామి దేవస్థానం ధర్మకర్తగా తెలంగాణ మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాసుల మల్లికార్జున్‌ను దేవదాయ శాఖ నియమించింది. ఈ సందర్భంగా మల్లికార్జున్‌ను వీరభద్రస్వామి సేవా సమితి ప్రతినిధులు అభినందించి ఘనంగా సత్కరించారు. మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కొండూరు వినోద్‌కుమార్, ఆనంద్‌రావు, విజయ్‌కుమార్, చిత్తరంజన్ ఉన్నారు.

పుట్‌పాత్‌పై వ్యక్తి మృతి

కాచిగూడ, డిసెంబర్ 15: అనారోగ్యంతో పుట్‌పాత్‌పై వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట డివిజన్‌లోని రత్నానగర్ ప్రాంతానికి చెందిన కృష్ణ(50) కాచిగూడ బస్ టర్మినల్ పుట్‌పాత్‌పై ఆదివారం అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

మహేష్‌నగర్‌లో అయ్యప్ప మహా పడి పూజ

స్వామి వారి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న ముళ్లె రాకేశ్, కిశోర్ గుప్తా తదితరులు

అబిడ్స్, డిసెంబర్ 15 : కార్వాన్ నియోజకవర్గం గుడిమల్కాపూర్ మహేష్‌నగర్ కాలనీలో అయ్యప్ప స్వామి మహా పడిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నం సుబ్బారావు నేతృత్వంలో పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసర కాలనీలకు చెందిన ప్రజలు, అసోసియేషన్ ప్రతినిధులు పడిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ గాయకుడు నర్సింగ్‌రావు గురుస్వామి నార్సింగి గాన బృందం నేతృత్వంలో భక్తి గీతాలను ఆలపించారు. భవానిశంకర్ గురుస్వామి పర్యవేక్షణలో పడిపూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, ఊరేగింపు, కన్నె స్వాముల నృత్యాలు, స్వామి వారి గీతాలాపనతో మహేశ్‌నగర్ కాలనీ మారు మోగింది. పట్నం సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహారం పంపిణీని చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ముళ్లె రాకేశ్, కిశోర్‌గుప్తా, న్యాయవాది రాజశేఖర్, నవీన్, గొరిగె శ్రీనివాస్, నర్సింహగౌడ్, శ్రీధర్, గార్లపల్లి ప్రదీప్, డోర్నాల ప్రసాద్, ప్రశాంత్, కాలనీ-2 అసోసియేషన్ ప్రతినిధులు విద్యాసాగర్, పద్మాచారి, అమర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రేగొండ రాములు, సందీప్, గొరిగె అరుణ్‌కుమార్, అర్జున్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్‌లో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్‌గుప్తా



మహా పడి పూజలో పాల్గొన్న సుబ్బారావు కుటుంబ సభ్యులు

కార్వాన్ నియోజకవర్గం జియాగూడ డివిజన్ దుర్గానగర్‌లో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ నాయకులు గోపాల్ గురుస్వామి ఈ పూజను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం, బీఆర్ఎస్ నాయకులు యాదశ్రీనివాస్‌గుప్తా, సి.బాబు, సత్యనారాయణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. మెహిదీపట్నం, డిసెంబర్ 15

సజావుగా గ్రూప్-2 పరీక్ష

గ్రూప్- 2 సందర్భంగా హనుమాన్‌టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయం పరీక్షా కేంద్రం వద్ద సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, ఎస్ఐ శ్వేత

సుల్తాన్‌బజార్,డిసెంబర్ 15 : గ్రూప్-2 పరీక్ష-2024 ఆదివారం సజావుగా జరిగాయి. హనుమాన్‌టేక్డీలోని ప్రగతి మహావిద్యాలయం, జాంబాగ్‌లోని వివేక్ వర్ధిని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రాలలో గ్రూప్-2 పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి నేతృత్వంలో ఎస్ఐ శ్వేత, ఎస్ఐ మధుసూదన్‌లు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ప్రగతి మహా విద్యాలయం కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లలో 768 మంది అభ్యర్థులకు గాను 322 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఇదిలా ఉండగా వివేక్ వర్ధిని డిగ్రీ కళాశాలలో రెండు సెషన్‌లలో 1056 మంది అభ్యర్థులకు గాను 323 మంది పరీక్షకు హాజరయ్యారని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపారు.

కాచిగూడ : గ్రూప్-2 పరీక్షలు కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష సమయానికి గంట ముందే రావాలని అధికారులు హెచ్చరించడంతో బర్కత్‌పురలోని అవంతి కళాశాల, శ్యామలాదేవి కళాశాల, కాచిగూడలోని బద్రుక కళాశాల, కాచిగూడ జూనియర్ కళాశాల సెంటర్‌లో అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. నాలుగు సెంటర్‌లలో మొత్తం 37 శాతం విద్యార్థులు హాజరైనట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి

భారత మాజీ ఉప ప్రధాని దివంగత సర్దార్ వల్లభాయ్ పటేల్ 74వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సుదర్శన్, అధికార ప్రతినిధి గణేశ్ నారాయణగూడ కేశవ మెమోరియల్ కాలేజీలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

– అంబర్‌పేట, డిసెంబర్ 15

దివ్యాంగులకు పరికరాల గుర్తింపు శిబిరం

అంబర్‌పేట, డిసెంబర్ 15 : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అంబర్‌పేటలోని మున్సిపల్ మైదానంలో దివ్యాంగులకు సహాయ పరికరాల కోసం ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. దివ్యాంగులకు చేతికర్రలు, వాకర్లు, మూడు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, చంక కర్రలు, వీల్‌చైర్లు, చెవికి ధరించే వినికిడి యంత్రాలు, కంటి అద్దాలు, కృత్రిమ దంతాలు, కృత్రిమ కాళ్లు, చేతులు వంటి ఉపకరణాల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన వారి నుంచి కొలతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, కార్పొరేటర్లు వై.అమృత, కన్నె ఉమాయాదవ్, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్, నాయకులు సి.కృష్ణాగౌడ్, ఇ.అజయ్‌కుమార్, ఎ.యశ్వంత్, రవీందర్‌గౌడ్, దివ్యాంగుల నాయకుడు కొల్లి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కలాపం ప్రదర్శన

శ్రీ సాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం గొల్ల కలాపం నృత్య ప్రదర్శన నిర్వహించారు. నృత్య గురువు డాక్టర్ పి. రమాదేవి విప్రనారాయణ పాత్రలో తన శిష్యురాలు మనస్విని అవ్వారి గొల్లభామ పాత్రలో నృత్యప్రదర్శన చేసి, ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు.

– (తెలుగు యూనివర్సిటీ)